




# మండుటెండలో ఉపాధి కూలీల నరకం

- నిప్పులు చెరుగుతున్న ఎండ.. అధికారుల నిలువు దోపిడీ!
- ఏపీవో, సెక్రటరీల నిర్లక్ష్యం
- ఒంటిగంట దాటినా పనుల్లోనే.. టెంట్లు, ఓఆర్ఎస్ ఏవీ?

**తుడుం జితేందర్ - జనం పవర్ - ఉత్తర తెలంగాణ బ్యూరో**

ఉదయం 11 గంటలకే పని ముగిస్తాం.. కూలీలకు చల్లని తాగునీరు.. నీడ కోసం టెంట్లు.. వడదెబ్బ తగలకుండా ఓఆర్ఎస్ ప్యాకెట్లు ఇస్తున్నాం.. ఇవి జన్నారం ఏపీవో రవీందర్ పత్రికలకు ఇచ్చిన ఆకర్షణీయమైన ప్రకటనలు. కానీ క్షేత్రస్థాయిలో వాస్తవాలు చూస్తే అధికారుల మాటలు ఎంతటి పచ్చి అబద్ధాలో అర్థమవుతోంది. మండుతున్న ఎండలో కూలీల ప్రాణాలతో చెలగాటమాడుతున్న జన్నారం మండల అధికారుల తీరుపై స్థానికులు మండిపడుతున్నారు.

## సాక్ష్యాలతో సహా దొరికిన అధికారులు

ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఎండల తీవ్రత దృష్ట్యా ఉదయం 11 గంటలకే పని ముగించాలి. కానీ జన్నారం మండలంలో మధ్యాహ్నం 1:05 గంటలు అవుతున్నా కూలీలను పని ప్రదేశం నుండి పంపడం లేదు. తీసిన ఫోటోల్లోని జీపీఎస్ టైమ్ స్టాంప్ దీనికి సజీవ సాక్ష్యంగా నిలుస్తోంది. మాడు పగిలే ఎండలో కనీసం తలదాచుకోవడానికి ఒక్క టెంట్ లేదు.. తాగడానికి చుక్క నీరు లేదు. అధికారుల ఏసీ గదుల ప్రకటనలకు.. పేద కూలీల కష్టానికి ఎక్కడా పొంతన లేదు.

## అడిగితే అరాచకం.. ఫోన్ చేస్తే నిర్లక్ష్యం

ఫీల్డ్ అసిస్టెంట్లు.. గ్రామ కార్యదర్శులు కనీసం పని ప్రదేశం వైపు కన్నెత్తి చూడటం లేదు. కూలీలు తమ సమస్యలను చెప్పుకోవడానికి ఏపీవోకు ఫోన్ చేసినా పట్టించుకోని పరిస్థితి నెలకొంది. ప్రజలంటే లెక్కలేనితనంతో వ్యవహరిస్తున్నారని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మెడికల్ కిట్లు.. కనీస సౌకర్యాలు కల్పించకుండానే అన్నీ ఉన్నాయని పత్రికలకు ప్రకటనలు ఇవ్వడం ప్రజలను వంచించడమే అని విమర్శిస్తున్నారు.

## కలెక్టర్ చర్యలు తీసుకోవాలి

నిబంధనలను తుంగలో తొక్కి కూలీల ప్రాణాలను పణంగా పెడుతున్న జన్నారం మండల అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. 11 గంటలకు ముగించాల్సిన పనిని ఒంటిగంట వరకు ఎందుకు చేయిస్తున్నారో సమాధానం చెప్పాలి. టెంట్లు.. నీరు.. మెడిసిన్ కోసం వచ్చే నిధులు ఎక్కడికి పోతున్నాయో తేల్చాలి. ఫోన్ చేస్తే కనీసం స్పందించని ఏపీవోపై విచారణ జరపాలి. జిల్లా కలెక్టర్ వెంటనే స్పందించి.. క్షేత్రస్థాయిలో విచారణ జరిపి.. ఈ అరాచకానికి కారణమైన ఏపీవో.. గ్రామ కార్యదర్శి.. ఫీల్డ్ అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు.. ఉపాధి కూలీలు డిమాండ్ చేస్తున్నారు.

# 14న కొండగట్టుకు బండి సంజయ్ ఆశీర్వాద యాత్ర

- మహాశక్తి ఆలయం నుండి అంజన్న సన్నిధి వరకు యాత్ర
- బీజేపీ సత్తా చాటేందుకే భారీ కార్యక్రమం: కొలిపాక రాజు.. మహిపాల్ రెడ్డి
- మండలం నుండి భారీగా తరలిరావాలని పిలుపు



**బెజ్జంకి, మార్చి 11 (జనం పవర్):**

కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ఈ నెల 14న కరీంనగర్ పట్టణంలోని మహాశక్తి ఆలయం నుండి కొండగట్టు అంజన్న స్వామి ఆలయం వరకు ఆశీర్వాద యాత్రను నిర్వహించనున్నారు. ఈ మేరకు బీజేపీ మండల అధ్యక్షుడు కొలిపాక రాజు.. కిసాన్ మోర్చా రాష్ట్ర కార్యదర్శి కరివేద మహిపాల్ రెడ్డి వివరాలు వెల్లడించారు. బుధవారం బెజ్జంకి మండల కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు.

## గల్లీ నుండి ఢిల్లీ దాకా ప్రాబల్యం

ఇటీవల జరిగిన కరీంనగర్ మున్సిపల్ ఎన్నికల్లో కార్పొరేషన్ స్థానాన్ని బీజేపీ కైవసం చేసుకున్న సందర్భంగా.. బండి సంజయ్ కుమార్ ఈ యాత్రను చేపట్టారని వారు తెలిపారు. గల్లీ నుండి ఢిల్లీ దాకా తెలిసే విధంగా తమ ప్రాబల్యాన్ని ప్రదర్శించనున్నట్లు చెప్పారు. రాబోయే స్థానిక ఎంపీటీసీ.. జెడ్ పీటీసీ ఎన్నికల్లో కూడా బీజేపీ అత్యధిక స్థానాలు గెలుచుకుని.. కరీంనగర్ జిల్లా పరిషత్ పీఠాన్ని కైవసం చేసుకుంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు.బండి సంజయ్ కుమార్ చేపట్టే ఆశీర్వయాత్రను బెజ్జంకి మండలంలోని బీజేపీ నాయకులు.. హనుమాన్ భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని వారు కోరారు. ఈ సమావేశంలో జిల్లా కౌన్సిల్ మెంబర్ బుర్ర మల్లేశం గౌడ్.. మండల ప్రధాన కార్యదర్శి బోయినపల్లి అనిల్ రావు.. కొత్తపేట రామచంద్రం.. గైని రాజు.. సంఘ రవి.. దొమ్మాటి రాములు.. జెల్ల అనిల్.. రాజమల్లు.. శ్రీకాంత్.. శ్రీనివాస్.. క్రాంతి.. అమర్.. బుర్ర కిషన్.. గాండ్ల శ్రీను.. నూనె అంజయ్య పాల్గొన్నారు.

# ఎస్టీయూ ఆధ్వర్యంలో మహిళా ఉపాధ్యాయులకు సన్మానం

- కనగర్తి పాఠశాలలో ఘనంగా మహిళా దినోత్సవం
- ముఖ్య అతిథిగా ఎస్.టీ.యూ రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి సాన కిషన్
- స్త్రీలు విద్యావంతులైతేనే సమాజం బాగుపడుతుంది: ప్రధానోపాధ్యాయులు



**కరీంనగర్, మార్చి 11 (జనం పవర్):**

అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని కనగర్తి జెడ్ పీ హెచ్ ఎస్ పాఠశాలలో మహిళా ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. ఎస్.టీ.యూ రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి సాన కిషన్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. పాఠశాల ఉపాధ్యాయులు వాణి.. సంజన.. శ్రుతకీర్తి.. సీ ఆర్ పీ వనితలను శాలువాలతో గౌరవించారు. ఈ సందర్భంగా హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు రాజేంద్రప్రసాద్.. ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కృష్ణమూర్తి మాట్లాడుతూ.. స్త్రీలు గౌరవించబడే చోట సుఖ సంతోషాలు ఉంటాయని తెలిపారు. ఒక మహిళ విద్యావంతురాలైతే కుటుంబంతో పాటు మొత్తం సమాజాన్ని మార్చే శక్తి ఆమెకు వస్తుందని పేర్కొన్నారు. ఎస్.టీ.యూ నేత సాన కిషన్ మాట్లాడుతూ.. భారతీయ సనాతన ధర్మంలో మహిళలకు అత్యున్నత స్థానం ఉందని చెప్పారు. దేవతలను కొలిచేటప్పుడు కూడా సీతారాములు.. లక్ష్మీ నరసింహస్వామి అని స్త్రీ మూర్తుల పేర్లకే ప్రాధాన్యత ఇస్తామని గుర్తు చేశారు. స్త్రీలను గౌరవించడం బాధ్యత అని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీధర్.. పవన్ ప్రసాద్.. కుమార స్వామి.. రిటైర్డ్ ఉపాధ్యాయుడు రాజేశ్వర్ రావు పాల్గొన్నారు.

# తంగళ్లపల్లిలో ఇంటిగ్రేటెడ్ స్కూల్ పనుల పరిశీలన

**23 ఎకరాల్లో రూ. 200 కోట్లతో మెగా విద్యాసంస్థ నిర్మాణం**

**నిర్మాణ పురోగతిలో రాష్ట్రంలోనే నంబర్ వన్: కలెక్టర్ హైమావతి**

**నాణ్యతతో యుద్ధ ప్రాతిపదికన పనులు పూర్తి చేయాలి**





**కోహెడ, మార్చి 11 (జనం పవర్):**

సిద్దిపేట జిల్లా కోహెడ మండలం తంగళ్లపల్లి గ్రామ శివారులో సుమారు 23 ఎకరాల విస్తీర్ణంలో రూ. 200 కోట్లతో నిర్మిస్తున్న ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ కాంప్లెక్స్ పనులను జిల్లా కలెక్టర్ కే. హైమావతి బుధవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. నిర్మాణ ప్రాంతం మొత్తం కలియతిరిగిన కలెక్టర్.. పనుల నాణ్యతను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఈ విద్యాసంస్థ నిర్మాణం రాష్ట్రంలోనే పురోగతిలో మొదటి స్థానంలో ఉండటం అభినందనీయమని పేర్కొన్నారు.

## నాణ్యతలో రాజీ పడొద్దు

అత్యంత భారీ స్థాయిలో నిర్మిస్తున్న ఈ విద్యాసంస్థ పనుల్లో పక్కా నాణ్యత ప్రమాణాలు పాటించాలని ఈడబ్ల్యూఐడీసీ (జుఔ×ణజ) ఇంజనీరింగ్ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. నిర్ణీత కాలవ్యవధిలో యుద్ధ ప్రాతిపదికన పనులు పూర్తి చేయాలని స్పష్టం చేశారు. రెవెన్యూ అధికారులు తరచూ పనులను పర్యవేక్షించాలని.. ఎక్కడా జాప్యం జరగకుండా చూడాలని సూచించారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి వసతులతో కూడిన విద్యను అందించడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు.

# వేసవిలో తాగునీటి ఎద్దడి రాకుండా చూడాలి: కలెక్టర్ హైమావతి

**శనిగరంలో మిషన్ భగీరథ వాటర్ ట్యాంక్ శుద్ధి పనుల పరిశీలన**

**99 రోజుల కార్యాచరణలో తాగునీటి సరఫరాకు ప్రాధాన్యత**

**నీటి సమస్య తలెత్తితే ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని ఆదేశం**

**కోహెడ, మార్చి 11 (జనం పవర్):**

ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా బుధవారం సిద్దిపేట జిల్లా కోహెడ మండలం శనిగరం గ్రామంలో జిల్లా కలెక్టర్ కే. హైమావతి పర్యటించారు. గ్రామంలోని మిషన్ భగీరథ వాటర్ ట్యాంక్ ను శుద్ధి చేసే ప్రక్రియను ఆమె క్షేత్రస్థాయిలో పరిశీలించి అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. 99 రోజుల కార్యాచరణలో నిర్దేశించిన 10 అంశాలలో ప్రజలకు శుద్ధమైన తాగునీటిని అందించడం అత్యంత ప్రాధాన్యత కలిగినదని పేర్కొన్నారు. వేసవి కాలం ప్రారంభమైన దృష్ట్యా జిల్లాలో ఎక్కడా నీటి ఎద్దడి రాకుండా ప్రత్యేక కార్యాచరణ సిద్ధం చేసినట్లు తెలిపారు. మిషన్ భగీరథ అధికారులు నిరంతరం గ్రామాల్లో నీటి సరఫరాను పర్యవేక్షించాలని ఆదేశించారు. ఎక్కడైనా సమస్యలు ఎదురైతే వెంటనే ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా ప్రజలకు నీటిని సరఫరా చేయాలని కలెక్టర్ సూచించారు. తాగునీటి సమస్యల పరిష్కారం కోసం గ్రామ పంచాయతీ కార్యదర్శులు.. సర్పంచులు.. వార్డు సభ్యులు మిషన్ భగీరథ అధికారులతో సమన్వయం చేసుకుని పనిచేయాలని స్పష్టం చేశారు. నీటి ట్యాంకుల పరిశుభ్రత.. నిరంతర సరఫరా విషయంలో ఎక్కడా జాప్యం జరగకూడదని అధికారులను ఆదేశించారు.





# సంగారెడ్డి బైపాస్ రోడ్డు విస్తరణ పనులను పరిశీలించిన జగ్గారెడ్డి

**పనులను వేగవంతం చేయాలని కాంట్రాక్టర్ కు సూచన**

**ఐబీ గెస్ట్ హౌస్ నుండి ఆర్డీఓ క్యాంప్ ఆఫీస్ వరకు పాదయాత్రగా పరిశీలన**

**రోడ్డు పనుల్లో నాణ్యత లోపిస్తే చర్యలు తప్పవు**

**సంగారెడ్డి, మార్చి 12 (జనం పవర్):**

సంగారెడ్డి బైపాస్ రోడ్డు విస్తరణ పనులను జగ్గారెడ్డి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఐబీ గెస్ట్ హౌస్ నుండి ఆర్డీఓ క్యాంప్ ఆఫీస్ వరకు ఆయన నడుచుకుంటూ వెళ్లి పనులు జరుగుతున్న తీరును నిర్మాణ సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఆర్డీఓ నివాసం వద్ద మలుపులో సర్కిల్ రానున్న నేపథ్యంలో.. అక్కడ ఉన్న చెట్లు.. నిర్మాణాలను సాధ్యమైనంత త్వరగా తొలగించాలని కాంట్రాక్టర్ కు సూచించారు.

## నాణ్యత విషయంలో రాజీ పడొద్దు

ఐబీ గెస్ట్ హౌస్ నుండి బసవేశ్వర విగ్రహం వరకు జరుగుతున్న విస్తరణ పనుల్లో వేగం పెంచాలని జగ్గారెడ్డి ఆదేశించారు. రోడ్డు నిర్మాణంలో ఎలాంటి నాణ్యత లోపాలు ఉండకూడదని.. నాణ్యత లోపిస్తే కఠిన చర్యలు ఉంటాయని కాంట్రాక్టర్ ను హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో టౌన్ ప్రెసిడెంట్ జార్జ్.. కాంగ్రెస్ నాయకుడు కూన సంతోష్.. సంగారెడ్డి మున్సిపల్ వైస్ చైర్మన్ షఫీ హఫీజ్ పాల్గొన్నారు.



# జన్నారంలో పదో తరగతి పరీక్షలకు సర్వం సిద్ధం

**3 కేంద్రాల్లో 651 మంది విద్యార్థులు**

**ఈ నెల 14 నుండి వార్షిక పరీక్షలు ప్రారంభం**

**పకడ్బందీ ఏర్పాట్లు చేసిన విద్యాశాఖ**

**పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు: ఎంఈఓ విజయ్ కుమార్**

తుడుం జితేందర్ - జనం పవర్ - ఉత్తర తెలంగాణ బ్యూరో



జన్నారం మండలంలో ఈ నెల 14 నుండి ప్రారంభం కానున్న పదో తరగతి వార్షిక పరీక్షల కోసం విద్యాశాఖ పక్కాగా ఏర్పాట్లు చేస్తోంది. పరీక్షల నిర్వహణపై మండల విద్యాధికారి (ఎంఈఓ) విజయ్ కుమార్ బుధవారం వివరాలను వెల్లడించారు. విద్యార్థులు ఎటువంటి ఇబ్బందులు పడకుండా అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ ఏడాది జన్నారం మండల కేంద్రంలో మొత్తం 3 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. జిల్లా పరిషత్ సెకండరీ బాలుర ఉన్నత పాఠశాల కేంద్రంలో 191 మంది.. జిల్లా పరిషత్ సెకండరీ బాలికల ఉన్నత పాఠశాల కేంద్రంలో 200 మంది.. లిటిల్ హాండ్స్ పాఠశాల కేంద్రంలో 260 మంది విద్యార్థులు పరీక్ష రాయనున్నారు. మొత్తంగా మండల వ్యాప్తంగా 651 మంది విద్యార్థులు ఈ పరీక్షలకు హాజరుకానున్నారు. పరీక్షా కేంద్రాల్లో తాగునీరు.. విద్యుత్ సౌకర్యం.. వెలుతురు.. ఫర్నిచర్ వంటి కనీస వసతుల్లో లోటు లేకుండా చర్యలు తీసుకున్నట్లు ఎంఈఓ తెలిపారు. వేసవి తీవ్రతను దృష్టిలో ఉంచుకుని ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని ఆయా పాఠశాలల నిర్వాహకులకు ఆదేశాలు జారీ చేశారు. విద్యార్థులు ఎలాంటి ఒత్తిడికి లోనుకాకుండా ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాసేలా ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. పరీక్షా కేంద్రాల సమీపంలో 144 సెక్షన్ అమలులో ఉంటుందని.. జిరాక్స్ సెంటర్లు మూసివేయాలని అధికారులు సూచించారు. పరీక్షా కేంద్రాల వద్ద పకడ్బందీ నిఘా ఉంటుందని ఎంఈఓ స్పష్టం చేశారు. విద్యార్థులు పరీక్షా సమయానికి గంట ముందే కేంద్రాలకు చేరుకోవాలని విద్యాశాఖ కోరుతోంది.

# బిచ్కుందలో ఘనంగా సమర్థ రామదాసు పాదుక పూజలు

**యువతను ధర్మం వైపు నడిపించిన సమర్థులు**

**రామ మందిర మఠం ఆధ్వర్యంలో వేడుకలు**

**రెండు రోజుల పాటు కొనసాగనున్న కార్యక్రమం**



**బిచ్కుంద, మార్చి 11 (జనం పవర్):**

సమర్థ రామదాసు స్వామి పాదుకల పూజను బిచ్కుందలో భక్తులు ఘనంగా నిర్వహించారు. జుక్కల్ రామ మందిర మఠం ఆధ్వర్యంలో ప్రతి సంవత్సరం ఈ పాదుకల యాత్ర సాగుతుందని.. ఈ ఏడాది బిచ్కుందలో పూజలు నిర్వహించినట్లు కేశవ మహారాజ్ ఒక ప్రకటనలో తెలిపారు. రెండు రోజుల పాటు ఈ ఆధ్యాత్మిక కార్యక్రమం జరుగుతుందని పేర్కొన్నారు. ధర్మం రక్షించుకునేందుకు సమర్థుల వారు అనేక చోట్ల హనుమాన్ ఆలయాలు నిర్మించారని కేశవ మహారాజ్ వివరించారు. వ్యాయామశాలలు ఏర్పాటు చేసి యువకులను ఏకతాటిపైకి తెచ్చి.. వారిని ధర్మం వైపు నడిపించారని కొనియాడారు. పాదుక పూజలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని నిర్వాహకుడు ఎస్. రామ్ కిషన్ కోరారు.

# ఏఏవై కార్డుదారులకు కిలో చక్కర పంపిణీ చేయాలి

**రేషన్ డీలర్లతో తహసీల్దార్ వేణుగోపాల్ సమావేశం**



**జుక్కల్, మార్చి 11 (జనం పవర్):**

బిచ్కుంద మున్సిపల్ పరిధిలోని తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ వేణుగోపాల్ ఆధ్వర్యంలో రేషన్ డీలర్ల ప్రత్యేక సమావేశం నిర్వహించారు. అంత్యోదయ (ఏఏవై) రేషన్ కార్డులు ఉన్న వారికి ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుందని ఆయన ఈ సందర్భంగా తెలిపారు. ప్రతి నెల ఇచ్చే రేషన్ బియ్యంతో పాటు ఇకపై కార్డుకు ఒక కిలో చక్కర అందజేయాలని ప్రభుత్వ ఆదేశాలు వచ్చాయని వివరించారు. చక్కర పంపిణీకి సంబంధించి రేషన్ డీలర్లు అందరూ వెంటనే డీడీలు (ఞఞం) చెల్లించాలని తహసీల్దార్ ఆదేశించారు. సరుకుల పంపిణీలో ఖచ్చితంగా సమయపాలన పాటించాలని స్పష్టం చేశారు. వేసవి కాలం దృష్ట్యా రేషన్ షాపుల వద్ద ప్రజల కోసం చలివేంద్రాలు తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని సూచించారు. ఎండల తీవ్రత ఎక్కువగా ఉన్నందున ఉదయం లేదా సాయంత్రం వేళల్లోనే సరుకులు పంపిణీ చేయాలని డీలర్లకు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్టీ తహసీల్దార్ భరత్.. ఆర్ ఐ (=×) రవీందర్.. కుషాల్.. రేషన్ డీలర్లు పాల్గొన్నారు.




# పట్టుదలతో చదివి లక్ష్యాన్ని చేరుకోవాలి

- ఎస్ఐ బోయిని సౌజన్య
- బెజ్జంకి బాలికల ఉన్నత పాఠశాలలో పదవ తరగతి విద్యార్థుల వీడ్కోలు సభ
- అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని ఎస్ఐ సూచన
- ఉపాధ్యాయులు.. తల్లిదండ్రులకు మంచి పేరు తేవాలని పిలుపు




**బెజ్జంకి, మార్చి 11 (జనం పవర్):**

విద్యార్థులు క్రమశిక్షణ.. పట్టుదలతో చదివి తాము అనుకున్న లక్ష్యాన్ని చేరుకోవాలని బెజ్జంకి ఎస్ఐ బోయిని సౌజన్య పిలుపునిచ్చారు. బుధవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో పదవ తరగతి విద్యార్థులకు ఏర్పాటు చేసిన వీడ్కోలు సమావేశంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.

**ఉన్నత చదువులతో రాణించాలి**

ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ విద్యార్థులు అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని సూచించారు. కష్టపడి చదివి ఉన్నత విద్యను అభ్యసించాలని.. తాము చదువుకున్న పాఠశాల.. ఉపాధ్యాయులు.. తల్లిదండ్రులకు మంచి పేరు ప్రతిష్టలు తేవాలని కోరారు. సమావేశంలో విద్యార్థులు తమ పాఠశాల అనుభవాలను పంచుకుంటూ భావోద్వేగానికి గురయ్యారు. వారి మాటలు అక్కడ ఉన్న వారిని కన్నీటి పర్యంతం చేశాయి.

**ఆకట్టుకున్న సాంస్కృతిక ప్రదర్శనలు**

సమావేశం అనంతరం విద్యార్థినులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమానికి పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఎస్ రేవతి అధ్యక్షత వహించారు. ఈ వేడుకల్లో తొమ్మిదో తరగతి విద్యార్థులు.. ఉపాధ్యాయ బృందం.. ఇతర తరగతుల విద్యార్థులు పాల్గొన్నారు.

# అల్లాంపై 'ఖాకీ' పంజా

- 1500 లీటర్ల బెల్లం పానకం ధ్వంసం
- పోలీస్.. ఎక్సైజ్ శాఖల సంయుక్త దాడులు
- నలుగురిపై కేసులు నమోదు.. 70 లీటర్ల నాటుసారా స్వాధీనం
- గ్రామాలను గుడుంబా రహితంగా మార్చాలని సీఐ పిలుపు



తుడుం జితేందర్ - జనం పవర్ - ఉత్తర తెలంగాణ బ్యూరో

మంచిర్యాల జిల్లా కోటపల్లి మండలంలోని అల్గాం గ్రామంలో గుడుంబా స్థావరాలే లక్ష్యంగా పోలీస్.. ఎక్సైజ్ శాఖ అధికారులు బుధవారం మెరుపు దాడులు నిర్వహించారు. నాటుసారా మహమ్మారిని రూపుమాపాలన్న సంకల్పంతో నిర్వహించిన ఈ సోదాల్లో భారీగా నిల్వలు పట్టుబడ్డాయి. అధికారులు ప్రతి ఇంటిని క్షుణ్ణంగా పరిశీలించి.. సారా తయారీకి సిద్ధంగా ఉంచిన కేంద్రాలను గుర్తించి ధ్వంసం చేశారు. సుమారు 1500 లీటర్ల బెల్లం పానకాన్ని స్వాధీనం చేసుకుని అక్కడికక్కడే భూమిలో పారబోశారు. నలుగురు మహిళల నుండి 70 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకున్న అధికారులు.. వారిపై కేసులు నమోదు చేసినట్లు వెల్లడించారు.

**కుటుంబాలు చిన్నాభిన్నం కావొద్దు**

ఈ సందర్భంగా చెన్నూరు రూరల్ సీఐ కృష్ణ మాట్లాడుతూ.. గుడుంబా వల్ల ఎంతోమంది యువకులు వ్యసనాలకు బానిసలై ప్రాణాలు కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దీనివల్ల ఎన్నో కుటుంబాలు రోడ్డున పడుతున్నాయని.. సారా తయారీ.. విక్రయం లేదా ముడి సరుకులు సరఫరా చేసినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గ్రామాలను గుడుంబా రహితంగా మార్చేందుకు సర్పంచ్‌లు చొరవ చూపాలని.. గ్రామాల్లో అవగాహన కల్పించి నిషేధ తీర్మానాలు చేయాలని కోరారు. ఈ దాడుల్లో జిల్లా ఎక్సైజ్ టాస్క్ ఫోర్స్ సీఐ సమ్మయ్య.. కోటపల్లి ఎస్సై రాజశేఖర్.. ఎక్సైజ్ ఎస్సై వెంకటరమణ.. పోలీస్.. ఎక్సైజ్ సిబ్బంది పాల్గొన్నారు.

# రౌడీల్లా బీఆర్ఎస్ నేతల వ్యాఖ్యలు

**అధికారంలో ఉన్నామనే భ్రమలో బీఆర్ఎస్ నేతలు**

**ఒగ్గు దామోదర్ పై అనుచిత వ్యాఖ్యలకు కాంగ్రెస్ కౌంటర్**



**బెజ్జంకి, మార్చి 11 (జనం పవర్):**

బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఒగ్గు దామోదర్ నాలుక చీరేస్తాం అంటూ బీఆర్ఎస్ నేతలు చేసిన వ్యాఖ్యలు రౌడీయిజంలా ఉన్నాయని బ్లాక్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు లింగాల శ్రీనివాస్ విమర్శించారు. బుధవారం బెజ్జంకి మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. బీఆర్ఎస్ నేతలు ఇంకా అధికారంలో ఉన్నామనే భ్రమలో ఉండటం సిగ్గుచేటన్నారు. ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ సహాయ సహకారంతో దామోదర్ బెజ్జంకి మండలాన్ని అభివృద్ధి చేస్తున్నారని తెలిపారు.

**కబ్జాలు ప్రజలకు తెలుసు**

ఆలయ కమిటీ చైర్మన్ ప్రభాకర్ మాట్లాడుతూ అసలు ఉద్యమకారులు ఎక్కడ ఉన్నారని ప్రశ్నించారు. మాజీ సర్పంచ్ రావుల నర్సయ్య మాట్లాడుతూ బీఆర్ఎస్ నాయకుల కబ్జాలు ప్రజలకు తెలుసని.. పదేళ్లలో మండలం అభివృద్ధికి నోచుకోలేదని మండిపడ్డారు. 10 ఎకరాలు అమ్మి ఆలయాన్ని అభివృద్ధి చేస్తానన్న రసమయి బాలకిషన్ ఆ భూమిని ఎప్పుడు అమ్ముతారో చెప్పాలని.. కొనేవారు రెడీగా ఉన్నారని వ్యాఖ్యానించారు. ఈ సమావేశంలో మచ్చ కుమార్.. కొంకటి రాములు.. కర్రావుల సందీప్.. బొనగం రమేష్ గౌడ్.. ఎలిగే సతీష్.. బండి వేణు.. బోనాల మల్లేశం.. ఆడుకని నర్సింగారావు తదితరులు పాల్గొన్నారు.




# ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఘనంగా మహిళా దినోత్సవం

**అవని నుండి అంతరిక్షం వరకు మహిళల ప్రావీణ్యం**

**మున్సిపల్ చైర్మన్.. ప్రిన్సిపాల్ సమక్షంలో వేడుకలు**

**ఉన్నత లక్ష్యాల దిశగా అడుగులు వేయాలని పిలుపు**

**బిచ్కుంద, మార్చి 11 (జనం పవర్):**

బిచ్కుంద ప్రభుత్వ డిగ్రీ కళాశాల (అటానమస్) లో మహిళా సాధికారత విభాగం ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. కళాశాల ప్రిన్సిపల్ కే. అశోక్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి బిచ్కుంద మున్సిపల్ చైర్మన్ సీమ షెట్కర్.. వైస్ చైర్మన్ భాగ్యలక్ష్మి.. కౌన్సిలర్ ధర్పల్లి కార్తిక.. మహిళా కౌన్సిలర్లు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. సరస్వతీ పూజ.. జ్యోతి ప్రజ్వలనతో వేడుకలు ప్రారంభమయ్యాయి. మున్సిపల్ చైర్మన్ సీమ షెట్కర్ మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని విద్యార్థినులకు సూచించారు. ప్రిన్సిపల్ కే. అశోక్ మాట్లాడుతూ నేడు మహిళలు పురుషులతో పోటీపడుతూ భూమి నుండి అంతరిక్షం వరకు అన్ని చోట్లా తమ ప్రతిభను చాటుతున్నారని కొనియాడారు. వారిని ఆదర్శంగా తీసుకుని ఉన్నత లక్ష్యాలతో శ్రమించి.. తమ కలలను నెరవేర్చుకోవాలని విద్యార్థినులకు సూచించారు. అనంతరం కళాశాల అధ్యాపక బృందం అతిథులను.. మహిళా సిబ్బందిని శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మహిళా సాధికారత విభాగం సమన్వయకర్త వై. రేవతి.. అధ్యాపకులు.. విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

